క్లుప్తంగా

మందిర జీర్ణోద్ధరణకు శంకుస్థాపన



గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 23 డివిజన్ కంకరగుంట రైల్వేగేటు ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి మందిర జీర్ణోద్ధరణ పనులకు సోమవారం ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి శంకుస్థాపన చేశారు. సీతారామచంద్రస్వామి వారి మందిర జీర్ణోద్ధరణతో పాటు సాయిబాబా మందిర అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో పాటు 23వ డివిజన్ కార్పొరేటర్ సాదు ఉమా మహేశ్వరీ రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

'కిట్స్' విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి, ఉన్నత లక్ష్య సాధన దిశగా కృషిచేయాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని కళాశాలలో విద్యార్థులకు ట్రాన్స్‌ఫార్మింగ్ సెల్ఫ్ అండ్ రిలేషన్‌షిప్స్‌పై మోటివేషన్ తరగతులు నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మానసికంగా అభివృద్ధి చెందడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయన్నారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ మానసికంగా ధృడంగా ఉన్న విద్యార్థులు ఉన్నత శిఖరాలను సులువుగా చేరుకొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఐ.నరసింహస్వామి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ జి.మురళి పాల్గొన్నారు.

విద్యుత్ పోరాట అమరవీరులకు ఘన నివాళి



పెదనందిపాడు: విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు ఘననివాళులర్పించారు. సోమవారం ఉదయం పెదనందిపాడులోని తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో అఖిలపక్ష గుంటూరు చానల్ పోరాట సంఘం కన్వీనర్ నరిశెట్టి ఆచార్యులు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అమరుల చిత్రపటాలకు నరిశెట్టి ఆచార్యులు, పాల్గొన్న నాయకులు అమరులకు నివాళులర్పించారు. ఆనాడు విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ప్రాణాలర్పించిన రామకృష్ణ, విష్ణు వర్ధన్‌రెడ్డి, బాలస్వామిల త్యాగం మరువలేనిదని అన్నారు. వారి స్ఫూర్తితో నేటికి ఉద్యమం కొనసాగుతోందన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు కాకుమాను నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యమ కారులను గుర్రాలతో తొక్కించి, తుపాకి కాల్పులు జరిపారన్నారు. ఆ దమనకాండలో 130 మందికి బుల్లెట్ గాయాలయ్యాయని చెప్పారు. అమరుల త్యాగం మరువలేనిదన్నారు. విద్యుత్ చార్జీల భారం మీద ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు జరిగే వామపక్ష ఆందోళనలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయ పోరాట నాయకులు గారపాటి రమేష్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు

మామిళ్లపల్లి(చేబ్రోలు): పేదలందరికీ గ్రామస్థాయిలోనే ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. మామిళ్లపల్లి గ్రామంలో సోమవారం విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఎంజీఎన్ఆర్‌ఈజీఎస్, హెల్త్ డిపార్ట్‌మెంట్‌ల నుంచి రూ.17.50 లక్షల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. వైద్య రంగంలో అమలవుతున్న సంస్కరణలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులను ప్రభుత్వం గ్రామీణులకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. దేశ చరిత్రలో తొలిసారిగా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని తీసుకువచ్చినట్లు వివరించారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గ్రామ సర్పంచ్ జాలాది యానాదిరావు, ఎంపీటీసీ పోలూరి శ్రీనాథరెడ్డి, లంకపోతు పిచ్చిరెడ్డి, బీమానంద్, కూరాకుల సాంబయ్య, హరిబాబు, మన్నవ వైద్యాధికారి సయ్యద్ మొహమ్మద్ హుస్సేన్, బండి శివగోపాల్, భవనం వంశీరెడ్డి, ఇక్కుర్తి మల్లికార్జునరావు, బండి వెంకటేశ్వరరావు, సిలార్ బాషా, రుద్రపాటి ఆదిశేషు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందన ఉండాలి

- పునరావృతమైతే విభాగాధిపతులు నేరుగా పరిశీలించాలి
- కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులు రీ ఓపెన్ అయితే విభాగాధిపతులే నేరుగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్సప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులతో, సంబంధిత సిబ్బందితో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాంకు అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీలకై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. స్పందన అర్జీల అప్ డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 35 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 6, ఇంజినీరింగ్ విభాగానికి 20, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి 3 ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్.ఈ. భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి

నెహ్రూనగర్: బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా సంబంధిత పాఠశాలల్లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి నగరపాలక సంస్థ నోడల్ అధికారులను, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో నగరంలో బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చే కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి సచివాలయంలో 5 ఏళ్ల నుండి 18 ఏళ్లలోపు పిల్లలు ఎవరైతే బడికి వెళ్లడం లేదో రెండు రోజుల్లో వివరాలను ఎడ్యుకేషన్ కార్యదర్శుల ద్వారా సేకరించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ నుంచి ప్రత్యేకంగా సీఆర్పీలు, అధికారులు నగరపాలక సంస్థ నోడల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పిల్లల్లో అసలు బడికి వెళ్ళని వారు, డ్రాప్ అవుట్స్‌ను వేరుగా వివరాలు తీసుకొని చైల్డ్ ఇన్ఫో లో అప్‌లోడ్ చేయాలన్నారు. నగరంలో బడికి వెళ్లని వారిలో ర్యాక్ పికర్స్ పిల్లలు, వలసలు వచ్చిన వారి పిల్లలపై నోడల్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెండు రోజుల్లో పిల్లల సర్వే పూర్తి చేయాలని, నోడల్ అధికారుల వారీగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుని, రోజువారీ నివేదిక ఇవ్వాలన్నారు. గుంటూరు నగరంలో ఏ ఒక్కరూ బడి ఈడు వారు బడికి వెళ్లకుండా ఉండకూడదని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, నాగేంద్రమ్మ, జ్యోతి కిరణ్ పాల్గొన్నారు.

సస్పెన్షన్ కు గురైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో వివిధ కారణాల చేత సస్పెండ్ అయిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం నగర కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ కీర్తి చేకూరిని కలిసి వినతి పత్రం అందజేశారు. సస్పెండ్‌కు గురైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు చాంద్ బాషా తెలిపారు.

చిరస్మరణీయుడు గిడుగు రామ్మూర్తి



లక్ష్మీపురం: గిడుగు రామ్మూర్తి నిర్వహించిన తెలుగు వ్యవహారిక భాషోద్యమం వల్లనే ఏ కొద్ది మందికో పరిమితమైన చదువు వ్యవహారిక భాషలో కొనసాగి అందరికీ అందుబాటులోకి వచ్చిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి జయంతి సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ సాహితీవేత్త ముప్పాళ్ళ వి.ఎస్ ప్రసాదరావు, రచయిత్రి ఎ.వి.కె సుజాత మాట్లాడుతూ తెలుగు భాషా సోయగం చూసి తన్మయులు కాని వారుండరని, తెలుగు భాషలో ఉన్నన్ని సాహితీ ప్రక్రియలు మరే బాషలో లేవన్నారు. అనంతరం రాజశేఖర్, పోతురాజు, భాగ్యలక్ష్మీ, నారాయణ ప్రసంగించి నివాళుర్పించారు. జాతీయ నటపురస్కార గ్రహీతలకు అభినందలు జాతీయ ఉత్తమ నట పురస్కారానికి అల్లు అర్జున్ నూటికి నూరు శాతం అర్హుడేనని, తెలుగు సినీ పరిశ్రమ యావత్తు గుండెలకు హత్తుకుని జేజేలు పలకటం ఆయన నటనకు నిదర్శనమని రంగ స్థల నటుడు, గాయకుడు ఎం.ఘన శ్యామాచార్యులు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం జాతీయ నటపురస్కార గ్రహీతలకు అభినంద సభ నిర్వహించారు.

పేదల సొంతింటి కల జగనన్నతో సాకారం

- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు
- పశ్చిమ శాసన సభ్యుడు మద్దాళి గిరిధర్
- అనంతవరప్పాడు, కొర్నెపాడు జగనన్న లే అవుట్ల పరిశీలన



లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మేయర్ మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ప్రతి ఒక్కరి సొంతింటి కలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన వట్టిచెరుకూరు మండలంలోని అనంతవరప్పాడు, కొర్నెపాడు జగనన్న లే అవుట్లను క్షేత్రస్థాయిలో వారు సోమవారం పరిశీలించారు. నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సొంతింటి కల నెరవేర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మందికిపైగా ఇళ్ల స్థలాలను మంజూరు చేశారని చెప్పారు. గుంటూరు నగరంలో తూర్పు, పశ్చిమ, పత్తిపాడు నియోజకవర్గాలకు సంబంధించి సుమారు 67,781 ప్లాట్లను ప్రజలకు పంపిణీ చేశామని ఆయన తెలిపారు. అనంతవరప్పాడులో 6,387, కొర్నెపాడు లే అవుట్ లో సుమారు 14,658 ప్లాట్లను నగరంలోని పేదలకు ఇచ్చినట్లు వెల్లడించారు. లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా మౌలిక వసతుల కల్పనకు నగర పాలక సంస్థ, ఇతర విభాగాల అధికారులను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ లాం, పొత్తూరు లే అవుట్లలో ఇప్పటికే గృహ నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయన్నారు. నిర్మాణ పనులు మొదలు పెట్టని లే అవుట్లలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ముందుకు రావాలని కోరారు.

లేఅవుట్లలో నిర్మాణాలకు తగిన తోడ్పాటును నగర పాలక సంస్థ అందిస్తుందని చెప్పారు. భవిష్యత్‌లో జగనన్న లేఅవుట్లు ఎంతగానో అభివృద్ధి చెందుతాయని, ఈ ప్రాంతాల్లో అవసరమైన వైద్యశాలలు, కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలలు నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎస్ఈ భాస్కర్‌రావు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈలు, ఏఈలు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య మలేరియా విభాగ కార్మికుడు బండి రాజు కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్ ను సోమవారం కమిషనర్ చాంబర్‌లో బయాలజిస్ట్ మధుసూదన్‌తో కలిసి కమిషనర్ అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ప్రజారోగ్య మలేరియా విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించే బండి రాజు ఇటీవల కాలంలో అనారోగ్యం వలన మరణించారని, ఆయన భార్య రమణకు ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షల చెక్ ని అందించామన్నారు. నగరపాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్లను ఆదేశించారు. కార్మికులు కూడా తమ సమస్యలపై ప్రతి గురువారం జరిగే ఉద్యోగుల గ్రీవెన్స్‌లో అర్జీలు, ఫిర్యాదులు అందించవచ్చని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాలల అభ్యున్నతికి కృషి చేస్తాం



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

నెహ్రూ నగర్: రాష్ట్రంలోని మాలల అభివృద్ధికి వారి అభ్యున్నతికి మాల ఐక్య సేవా సమితి కృషి చేస్తుందని మాల ఐక్య సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్ బాబు పేర్కొన్నారు. సోమవారం గుంటూరు అంబేద్కర్ భవన్‌లో మాల ఐక్య సేవా సమితి ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజ సుందర బాబు, కర్రా హనోక్ బెంజిమెన్, విప్పర్ల భాస్కర్ పాల్గొని ప్రసంగిస్తూ రాష్ట్రంలో రోజు రోజుకు మాలల ఐక్యత లేకపోవడం వల న అగ్రవర్ణ నాయకులు దాడులు చేయడం పరిపాటి మారిపోయిందని ఈ రాష్ట్రంలో మాలలు ఐక్యతగా ఉన్నప్పుడే మాలల మీద దాడులు ఆగుతాయని ఆ దిశగా మాలలు అందరూ రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బండ్లమూడి స్టాలిన్ బాబు మాట్లాడుతూ ఈ దేశంలో రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలపై దాడులు జరిగినప్పుడు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేస్తున్నారు తప్ప వారికి సరైన న్యాయం జరగటం లేదని రాజకీయ నాయకులు వారి స్వార్ధ రాజకీయాల కోసం ఎస్సీ ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ బాధితులకు అన్యాయం జరుగుతున్న సందర్భంలో మాల ఐక్య సేవా సమితి తరపున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు. అనంతరం బండ్లమూడి స్టాలిన్ బాబు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తన్నీరు ప్రసన్నకుమారి, ఉద్యోగుల విభాగం అధ్యక్షులుగా మేళం సునీల్ ప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అక్కల వీరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి గోన మరియమ్మ, యువజన విభాగం అధ్యక్షులుగా నూకతోటి ఆనంద్, ముఖ్య సలహాదారునిగా డేవిడ్ విలియమ్స్, సలహాదారుగా చిన్నం డేవిడ్, జిల్లా అధ్యక్షులుగా గుడిపూడి బాబు, జిల్లా ఉపాధ్యక్షులుగా మంచాల భాగ్యరాజ్, జిల్లా కార్యదర్శిగా గుమ్మడి చిన్న, మహిళా జిల్లా కార్యదర్శిగా ఆదిలక్ష్మి, నగర అధ్యక్షులుగా గజ్జి అరవింద్ బాబును ఎన్నుకున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి మాలల అభివృద్ధి అభ్యున్నతికి అవసరమైన భవిష్యత్తు కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో మేధో సంపత్తి హక్కులపై అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: నూతన ఆవిష్కరణలకు పేటెంట్లు పొందే దిశగా విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేయాలని, అందుకు అనుగుణంగా అధ్యాపకులు తగిన శిక్షణను అందించాలని ఆంధ్ర యూనివర్శిటీ సెంటర్ ఫర్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ అనింద్యరాయ్‌చౌదరి పేర్కొన్నారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో మేధో సంపత్తి హక్కులపై (పేటెంట్) ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేటెంట్స్, కాపీ రైట్స్, డిజైన్, జాగ్రఫికల్ ఇండికేషన్, ట్రేడ్ మార్క్ , ట్రేడ్ సీక్రెట్, అనే అంశాలను గురించి వివరించారు. నూతన పరికరాలకు, వస్తువులకు పేటెంట్స్ హక్కులు పొందేందుకు జరిగే వివిధ దశలను తెలిపారు. విద్యార్థులు ఎంచుకొనే నూతన వస్తువులు, పరికరాల తయారీ రూపకల్పనలో ఎదుటివారిని ఆకర్షించే తత్వం ఇదివరకు ఎన్నడూ లేనిది, సమాజానికి ఉపయోగపడేది వుండాలని తెలిపారు.

మనదేశంలో తయారైన వస్తువులకు పేటెంట్స్ పొందుతూ విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి నేడు భారతదేశం చేరడం గర్వకారణమన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, డాక్టర్ కె.శోభ, జి.చైతన్య, ఏవీ రామకృష్ణ ఉన్నారు.

సత్తా చాటిన జీజీహెచ్ నర్సింగ్ సిబ్బంది



నర్సింగ్ సిబ్బందిని అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఈ నెల 25, 26 వ తేదీల్లో జాతీయ ఆంకాలజీ నర్సింగ్, సింపోజియం జరిగింది. ఈపోటీల్లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్ నర్సింగ్ సిబ్బంది తమ సత్తా చూపారు. సదస్సు లో దేశ వ్యాప్తంగా హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు 1200 మంది పాల్గొన్నారు. గుంటూరు నాట్కో క్యాన్సర్ కేంద్రం నుంచి ఏడుగురు హాజరయ్యారు. క్యాన్సర్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ టి.వి. శివరామకృష్ణ ఆధ్వర్యంలో హాజరైన గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందుకున్నారు. సోమవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ను నర్సింగ్ సిబ్బందిక కలిసి తమ విజయగాథను పంచుకున్నారు. పోస్టర్ ప్రెసెంటేషన్‌లో హెడ్ నర్సు దాసరి రోజ్‌రాణి, జి.గౌరీ కల్యాణి, కె. రాజ్యలక్ష్మి బహుమతులు సాధించారు. క్విజ్ పోటీ ల్లో స్టాఫ్ నర్సులు జి.ఉషారాణి, కె.వెంకట సుబ్బమ్మలకు ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది ప్రశంస పత్రాలతో పాటు నగదు బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం హెడ్‌నర్సు రోజ్‌రాణి ఆధ్వర్యంలో రూ. 5 వేలు నర్సింగ్ సిబ్బంది అందజేశారు. ఆసుపత్రిలో పనిచేస్తూ వారికి వచ్చిన నగదును తిరిగి ఆసుపత్రి కోసం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.

జీవ్ దయ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

గుంటూరు మెడికల్: జీవ్ దయ ఫౌండేషన్ నిర్వాహకులు సోమవారం గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వైద్య విభాగానికి రూ. 50 వేలు విలువ చేసే వైద్య పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ గైనకాలజీ విభాగాలకు ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సేవ ధృక్పథంతో వైద్య పరికరాలు అందించిన జీవ్ దయ ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.జయంతి మాట్లాడుతు గర్భిణులకు కాన్పుల సమయంలో ఇబ్బందులు పడకుండా, అధిక రక్త స్రావం జరగకుండా నివారించేందుకు అత్యాధునిక వైద్య పరికరాలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. సంస్థ అందజేసిన వైద్య పరికరాలను సూపరింటెండెంట్ చేతుల మీదుగా గైనకాలజీ విభాగానికి సరఫరా చేశారు. కార్యక్రమం లో డాక్టర్ వి.అరుణ, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ దుర్గాదేవి, పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

డ్వాక్రా స్వయం సహాయక సంఘం వస్త్ర దుకాణం ప్రారంభం



వస్త్ర దుకాణం ప్రారంభోత్సవంలో మేకతోటి దయాసాగర్

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని, మహిళను ఆర్థికంగా అభివృద్ధి పరచటమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ అన్నారు. సోమవారం వెంగళాయపాలెం గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరి స్వయం సహాయక సంఘం సభ్యులు గ్రంధి శ్రీలక్ష్మి, హరిహరకుమార్ దంపతులు రాష్ట్ర ప్రభుత్వం అందించిన వడ్డీలేని రుణ సాయంతో ఏర్పాటు చేసిన వస్త్ర దుకాణం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి చిరు వ్యాపారాల కోసం జగనన్న ఆసరా, జగనన్న తోడు, అమ్మ ఒడి, వడ్డీలేని రుణాలు, పావల వడ్డీ రుణాలు అందిస్తూ.. కృషి చేస్తున్నారన్నారు. ప్రతి మహిళ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగించుకుని చిరు వ్యాపారాలు చేసి, తమ కుటుంబాలను ఆర్థికంగా మెరుగు పరుచుకోవాలని కోరారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి వద్దకే వచ్చి అందుతున్నాయన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని.. నేడు దేశంలోని ప్రతి రాష్ట్రం అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులున్నారు.

డిప్లమో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

చేబ్రోలు: డిప్లమో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆర్‌వీ ఐటీ కళాశాల వైస్ చైర్మన్ గొట్టిపాటి మస్తాన్ చౌదరి అన్నారు. చేబ్రోలులోని కళాశాలలో సోమవారం డిప్లమో మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిప్లమో కోర్సులో ప్రతిభ కనబరిచి, అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మా నించారు. నగదు బహుమతులను అందజేశారు. డిప్లమో విద్యార్థులు ఈ ఏడాది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో స్థానంలో, జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు కళాశాల డైరెక్టర్ మాలెపాటి శ్రీనివాస్ తెలిపారు. ప్రిన్సిపల్ దూళ్ల శ్రీధర్, వైస్ ప్రిన్సిపల్ పట్టాభి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

గుంటూరు ఈస్ట్: రెండు వర్గాలు ఘర్షణపడ్డ ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్త కాలనీలో నివసించే ఆమకృష్ణకు దుర్గానగర్‌కు చెందిన సాయికృష్ణ ఫోన్ చేశాడు. రామకృష్ణ ఫోన్ మరొకరికి ఇచ్చి తాను లేనని చెప్పించాడు. ఈనేపథ్యంలో సాయికృష్ణ, తరుణ్, సుందరయ్యలు రామకృష్ణ వద్దకు వచ్చి గొడవపడి కొట్టారు. రామకృష్ణ తన మిత్రుడు సాయి వెంటబెట్టుకుని వెళ్లి ముగ్గురిపై దాడిచేసి కొట్టారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేడికొండూరులో మెగా వైద్య శిబిరం

మేడికొండూరు: మండల పరిధిలోని లూథరన్ చార్చి సమీపంలో హెల్ప్ ఫౌండేషన్ నెహ్రూ యువ కేంద్రం సంస్థ ఆధ్వర్యంలో కామాక్షి ఐకేర్ వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఫాదర్ రెవ. దీలీప్ సోమవారం ప్రారంభించారు. ఫాదర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవాసంస్థల సేవలు మరువలేనివన్నారు. వైద్యుడు డాక్టర్ వాసుదేవరావు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా కంటి సమస్యలు అందరిని ఇబ్బంది పెడుతున్నాయని, వైద్యుల సలహాలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే కంటి సంరక్షణ బాగుంటుందన్నారు. అధిక సమయం టీవీ చూస్తుండటం వల్ల కంటి సమస్యలు ఎక్కువయ్యాయన్నారు. ఈ శిబిరంలో సుమారు 180 మందికి కంటి పరీక్షలు చేయడం జరిగిందన్నారు. కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమైన 18 మందిని గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ఫౌండేషన్ సభ్యుడు అంజలి, శ్రీలత, వనిత, సంఘ పెద్దలు శ్యామ్, నాగరాజు, రాజేంద్ర ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.